ఆ రోజు తెల్లవారుఝామునే నిద్ర లేచింది సీత.

పనులన్నీ తొందరగా తెముల్చుకుని తలంటు పోసుకుంది. కాఫీ తాగి బట్టలు మార్చుకుంది. టాయిలెటయి ఇంటి నుంచి బయటపడింది.

ఆకాశం మబ్బు మబ్బుగా ఉంది. చిరుగాలి మెల్లగా కదిలి ఆహ్లాదం కలిగిస్తూంది. ప్రకృతిఅంతాఆనందమయంగా కనిపించింది సీతకి. ఆ గాలి, ప్రశాంత వాతావరణం మనుషులు సుఖసంతోషాలతో ఆనందం పంచిపెడుతున్నట్లు అనిపించింది.

ప్రపంచం కొత్త రూపు సంతరించుకుని తనని ఆహ్వానిస్తున్నట్లు ఉంది.

నిన్నటికీ, నేటికీ ఎంత తేడా! త నెంత అదృష్టవంతురాలు!

ఆ శుభవార్త తెలియగానే తను సంతోషం పట్టలేకపోయింది. ఎగిరి గంతేసి పాటలు పాడాలనిపించింది. ఆ మాట కాస్త తల్లి చెవిని వేసేదాకా మనసు నిలవలేదు.

సంగతి తెలిసి సీత తల్లి ఆనంద బాష్పాలు రాల్చింది.

"పోన్లే, అమ్మా. నువ్వు మగబిడ్డవి కానందుకు ఎంతో కుమిలిపోయా నిన్నాళ్ళా. భగవంతుడు చల్లగా చూశాడు మనం అదృష్టవంతులం. [illegible] కొట్టుమిట్టాడుతున్న మనకి ఆ దేవుడే వెలుగు చూపాడు" అని తన సంతోషం తెలిపింది సీత తల్లి.

వాకిట్లో సీతకి తల్లి ఎదురయింది. గుమ్మం ముందు ముగ్గుకర్ర వేసి లోపలికి వస్తున్న సీత తల్లి కూతుర్ని అడిగింది:

"ఇంత ప్రొద్దుటే ఎక్కడికే, అమ్మాయీ, బయలుదేరావు?"

"ఇప్పుడే అలా సుందరి దగ్గరికి వెళ్ళి వస్తానమ్మా."

"సర్లే. తొందరగా రా."

సీత నవ్వుకుని రోడ్డు ఎక్కింది. ప్రశాంతంగా ఉంది ప్రకృతి. ఆహ్లాదం కలిగిస్తూంది వాతావరణం.

సీత [illegible] కాళ్ళు [illegible] ఆడిచాయి. సీతకి ఎంతో ఆనందంగా ఉంది.

ఆ భగవంతుడు కొన్ని కొన్ని జీవితాలని సమస్యల తోరణాలుగా సృష్టిస్తాడు. బ్రతుకే ఒక పోరాటంగా అనిపిస్తుం దప్పుడు.

లేకపోతే ఏమిటి?

నాన్న అట్లా అర్ధాంతరంగా పోవటం, ఏ ఆధారమూ లేకుండా తన కుటుంబం దీనస్థితిలో ఉండటం, బ్రతుకుశూన్యమైపోయి గుండె బ్రద్దలయిన తల్లి, ఇద్దరు తమ్ముళ్ళు, కుటుంబ ఆర్థిక ప్రతిపత్తి శూన్యంగా, భయం కలిగిస్తూ ఎదుట నిలిచి గుండెల్ని క్రుంగదీయటం... కుటుంబం ఏమయిపోవాలి? మనుగడ ఏ రకంగా సాగించాలి?

దారి తెన్నూ లేక [illegible] సతమతమయిన ఆ దినాలు ఎంత దారుణమయినవి? తలుచుకుంటే ఇప్పటికీ గుండె జలదరిస్తుంది.

కష్టాలు ఒంటిగా రావు. దూరదృష్టిలేని నాన్న సంసారాన్ని నట్టేట్లో ముంచి తన దారిని తను పోయాడు. ఆదుకునే హస్తాలే కరువయి బ్రతుకే పీడ కలగా పరిణమించింది. రోజు గడిచి నాలుగు వేళ్ళూ నోటిలోపలికి వెళ్ళేదాకా శూన్యంగా కనిపించింది. కడుపు కోసం రెక్కలమ్ముకుందామన్నా తగిన తెరువు చూపించే నాథుడు లేడు.

వయసులో ఉన్న తన కోరికల మాట సంగతి దేవుడికి తెలుసు! కాని, ఈ కుటుంబం నిలబడే దారి ఏది? కాళ్ళరిగేట్టు ఉద్యోగం కోసం ఎక్కని గుమ్మం లేదు.



భయంకరంగా వికటాట్టహాసం చేస్తూ ఎదుట నిలిచిన నిరుద్యోగ సమస్యని ఎట్లా పరిష్కరించటం? తనూ కొద్దో గొప్పో చదువుకుంది. టైపు నేర్చుకుంది. కష్టపడి పని చేస్తామ, ఉద్యోగం కావాలంటే ఇప్పించే నాథు డేడీ?

నాలుగు కడుపులు నిండాలి. కడుపు నింపుకోవాలంటే డబ్బులు కావాలి. ఒళ్ళు కప్పుకోవటానికీ, ఆకలి చల్లార్చుకోవటానికీ, పరువుగా బ్రతకటానికీ డబ్బు కావాలి. డబ్బు కావాలంటే కష్టపడి పని చెయ్యాలి. ఏదీ, పని ఏదీ? అవకాశమెక్కడ? తమ గోడు ఎవరి క్కావాలి?

ఏమి చేద్దామన్నా ఆడతనం అడ్డు వచ్చింది.

అమ్మ అన్న మాట నిజం. తను మగవాడుగా పుట్టినా ఈ సమస్య ఇంత వికృతరూపం దాల్చి ఉండేది కాదేమో? రిక్షా లాగో, కూలి చేసో, ఏదో పని చేసి సంసారాన్ని లాగగలిగి ఉండేది తను.

అదే జరగలేదు. అది తన దురదృష్టం.

ఒక ఖాళీ ఉందని ప్రకటిస్తే వందలాది అభ్యర్థులు. పోటీ. ఆ పోటీలో నెగ్గాలంటే ఉపాయం ఉండాలి. డబ్బు, రికమండేషను కావాలి. ఏవీ లేని తను ఏం చెయ్యగలదు?

ఎదురుగా ఓ రిక్షా వచ్చి సీత ఆలోచనని చెదరగొట్టింది.

పక్కకి తొలిగి గబగబా నడిచింది సీత.

సుందరి తన క్లాసుమేటు. వాళ్ళూ పేదవాళ్ళే. వాళ్ల స్థితీ తమకంటె

ఏమంత మంచిగా లేదు ఇప్పుడు. ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబం. పెద్ద వ్యాపారం ఉండేది. నష్టం వచ్చి చితికిపోయారు. సుందరి అన్నదమ్ములు ఆ రోజుల్లోనే ఉండేరి ఇప్పుడు మంచి స్థితిలోనే ఉన్నారు. కానీ, స్వార్థం వాళ్లని ముంచెత్తింది. భార్యల అడుగులకి మడుగు లొత్తుతూ వాళ్ల చెప్పుచేతల్లో నడుస్తున్నారు సుందరి అన్నలు. ఎప్పుడూ ఇటువైపు కన్నెత్తి చూడరు. ఏరు దాటి తెప్ప తగలేసే రకం. సుందరి మిగిలిపోయింది. తలిదండ్రుల గుండెలమీద కుంపటిలా మిగిలిపోయింది సుందరి. ముసలితనం దిగజారిపోయిన సుందరి తండ్రి ఏం చెయ్యగల డిప్పుడు? ఆ రోజుల్లో — ఆ ఇంట్లో లక్ష్మి కళకళలాడుతూ ఉన్న కాలంలో సుందరిని వాళ్ల బావ కిచ్చి పెళ్లి చెయ్యటానికి మాటలు జరిగాయి. అంతా అయిపోయిందనే అనుకున్నారు. కాని, దురదృష్టం ఎదురయింది. వ్యాపారంలో నష్టం వచ్చి ఆమె తండ్రి దివాలా తీశాడు. సుందరి పెళ్లి ఆగిపోయింది. పెద్దలు అడ్డు పెట్టారు.

సీత ఆగింది.

సీత అప్రయత్నంగానే ఆలోచనల్ని వదిలి వర్తమానంలోకి వచ్చింది.

సుందరి వాళ్ల ఇంటిముందు నిలబడి ఉంది తను!

కాళ్లు కదిలి ఇంట్లోకి దారి తీశాయి.

వాకిట్లో సుందరి తల్లి ఏదో పని చేసుకుంటూంది.

"నమస్కారం, పిన్నిగారూ!"

"ఎవరూ? సీతా! రా, అమ్మా." సుందరి తల్లి ఆప్యాయంగా ఆహ్వానించింది.

ఆమె కనులు గాజుదీపాల్లా ఉన్నాయి. ఆ కళ్లలో దిగులు గ్రహించగలిగింది సీత.

ఎదిగి వచ్చిన కూతురు, చితికిపోయిన సంసారం, బాకుల్లా కలకవేసే ఒకనాటి జ్ఞాపకాలు ఆ మనిషిని క్రుంగదీశాయి.

"సుందరి ఉందాండీ?" అడిగింది సీత.

"ఉంది. ఇంకా లేచినట్లు లేదు. కూర్చో, అమ్మా, పంపిస్తాను." అనిత లోపలికి వెళ్లింది.

ఆనాటి సోఫా కళ తప్పినట్టు దీనావస్థలో ఉన్నాయి. కేను చిరిగిపోయి ఉంది. సోఫాలో కూర్చుని చుట్టూ చూసింది సీత. గోడల్ని బూజు పట్టిన పటాలు. వాటిని దులపటానికి కూడా ఓపిక లేని జీవితాలు.

సుందరి ఎంత మంచిది!

మంచివాళ్లకే కష్టాలన్నీ.

> లేమిలో సానుభూతి చూపించే వ్యక్తి కాస్త చోటు దొరకగానే స్వార్థానికి కిరీటం తగిలించడం మనిషిలోని బలహీనతే. ఒకరి త్యాగంతో తను ఉద్యోగం సాధించినా, త్యాగానికి ఆ వ్యక్తి ప్రతిఫలం పొందడాన్ని సంకుచితమైన మనస్సు అంగీకరించడం కష్టమే. మనుషులు అందరూ ఒకటే అయినా బుద్ధులు పలు రకాలు.

ఇంటర్వ్యూనాడు— పది రోజుల కిందట అది జరిగింది. ఆ సందర్భంలో సుందరి ఎంత ఔన్నత్యం చూపించింది! నిజంగా గొప్ప ఇంటిపిల్ల ననిపించింది సుందరి!

ఆ ఊళ్లో కొత్తగా పెట్టిన ఒక కంపెనీ ఒక లేడీ టైపిస్టు కావాలని ప్రకటించింది. తనుకూడా అప్లికేషను పెట్టింది. ఇంటర్వ్యూకి వెళ్లింది సీత.

అక్కడికి వచ్చిన జనాన్ని చూసి సీత ఉత్సాహం నీరుగారిపోయింది.

ఒక ఉద్యోగానికి ఇంతమంది అభ్యర్థులా! ఎట్లా బ్రతకటం? దేవుడా! ఏది దారి? — అనుకుంటూ ఆందోళన పడే సీత, [illegible] కూర్చుండింది, తల వంచుకుని.

ఇంటర్వ్యూలు మొదలయాయి.

ఒక్కొక్కర్నీ పిలుస్తున్నారు.

"సీతా!" పరిచితమయిన పిలుపు. తల ఎత్తి చూసింది సీత.

"ఏమిటి, నువ్వూ ఉద్యోగానికేనా?"

నోరు రాక తల ఊపింది తను.

"సరి, సరి. ఇక్కడా మనిద్దరికీ పోటీ తప్పలేదన్న మాట! ఇట్లా రా. మాట్లాడాలి."

లేచి ఆమె ననుసరించింది సీత.

"నా ఇంటర్వ్యూ అయింది. మహా గట్టి ప్రశ్నలు వేస్తున్నారు. అభ్యర్థుల్లో ఒకరిద్దరు బి. ఎ. లూ ఉన్నారుట. నాకు మాత్రం నమ్మకం లేదు" అంది సుందరి.

సీత కళ్లు హిమపాతాలయి వర్షించాయి.

"ఛ! అదేమిటి?" భుజంమీద చెయ్యేసింది సుందరి.

"ఏం చెప్పను, సుందరీ! నా పరిస్థితి ఇట్లాంటిది" అని తన కడుపులో బాధంతా వెళ్లగక్కింది సీత.

"నేనూ దాదాపు అదే స్థితిలో ఉన్నాననుకో. కాకపోతే నువ్వు బయటపడి చెప్పుకున్నావు. నేను చెప్పుకోలేక ఏడుస్తున్నాను."

"పోన్లే, సుందరీ! ఎవరి అదృష్టానికి ఎవరు కర్తలు? కొన్ని కొన్ని జీవితాలు అట్లా ఉంటాయి." కళ్లు తుడుచుకుంది సీత.

"అయితే, నా పని కొంచెం మేలయింది. ఇంటర్వ్యూ చేసే మనిషి నాకు తెలిసినవాడు. ఉద్యోగం నాకే ఇస్తానని ప్రామిస్ చేశాడు." ఉత్సాహంతో సుందరి కనులు మెరిశాయి.

సీత ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసి చూసింది. "కంగ్రాచులేషన్స్, సుందరీ. అదృష్టవంతురాలివి. సరే, పోదామా?" అంది పేలవమయిన మొహంలోని ఆలోచనల్ని దాచటానికి ప్రయత్నిస్తూ.

"అదేమిటి? నీ ఇంటర్వ్యూ అవకుండానే."

"ఇంకా ఎందుకు? చెప్పేశావుగా! తెలిసికూడా ఎందుకు చీకట్లో వెతుక్కోవటం?"

సుందరి నవ్వింది.

"నువ్వు సీతా నన్నంత స్వార్థపరురాలిగా అనుకున్నావా? అవసరమయితే నా అవకాశం వదులుకుని నీకు సాయపడతాను."

"వద్దు, వద్దు."

"ఏం? అక్కర్లేదా?"

"అది కాదు."

"ఏది కాదు? నువ్వు నిజంగా బాధల్లో ఉంటే ఆ ఉద్యోగం నువ్వే తీసుకో. నా కేమిటి? ఇది కాకపోతే మరొకటి."

"సుందరీ!" సుందరి చేతులు పట్టుకుని ఆప్యాయంగా నిమిరింది సీత. "నువ్వు నిజంగా దేవతవి, సుందరీ!"

"ఈమాత్రం దానికేనా? బుద్ధిగా ఇంటర్వ్యూ పూర్తిచేసి, ధైర్యంగా ఇంటికెళ్లు. ఆ ఉద్యోగం నీది. సరేనా?"

సుందరి వెళ్లిపోయింది.

తను ఇంటర్వ్యూలో సమాధానాలు బాగానే చెప్పింది.

అయినా, అనుమానమే. అయితే, తన అనుమానం నిరాధారమని మూడోనాడే తెలిసింది. తనకి ఉద్యోగం వచ్చింది. వెంటనే జాయినవమని నిన్నటి రోజున మళ్లీ వర్తమానం.

తనకి నిజంగా కొండంత బలం వచ్చింది.

'పాపం! సుందరి తనని కాదనుకుని ఈ అవకాశం నాకు వచ్చేలా చేసింది. సుందరి ఎంత మంచిది! తన కష్టాలు పక్కకి నెట్టి ఎదటి మనిషిని ఆదుకునే వ్యక్తి సంస్కారం ఎంత గొప్పది!' అనుకుంది సీత.

సుందరి ఋణం తను ఎన్ని చేసినా తీర్చుకోలేనట్టిది.

ఈ రోజే ఉద్యోగంలో చేరుతుంది తను. ఆ సంగతి చెప్పుదామనే సుందరి దగ్గరికి పనిగట్టుకుని వచ్చి.

"హలో!"

సీత ఆలోచనలనుంచి బయటపడింది. సంభ్రమంగా లేచి నిలబడింది సీత, సుందరిని చూస్తూనే.

"ఈ వేళ చేరుతున్నావుగా?"

సీత ఆశ్చర్యపడి, "అవును. నీ కెవరు చెప్పారు?" అంది.

"నువ్వే." నవ్వింది సుందరి.

"నేనా?"

"అవునోయ్. నీ మొహం చెప్తుంటేను?"

సుందరి నవ్వులో శ్రుతి కలపటం తప్ప మరేం చెయ్యలేకపోయింది సీత.

"కూర్చో. కాఫీ తెస్తాను." సుందరి లోపలికి వెళ్లింది.

సుందరి ఎంత మంచిది! ఎంత తెలివిగా తనని చదివింది! ఆ చదువులో తన స్వార్థంకూడా గ్రహించు కోలేదుగద ఆ అమ్మాయి?

తనకి బాగా [illegible].

తను స్వార్థపరురాలు. తన స్వార్థంలో పడి సుందరి ఇబ్బందుల్ని గురించి ఆలోచించలేకపోయింది. స్నేహం పేర ఆమెకి అందిన అవకాశం తను లాగి పుచ్చుకుంది. దానికికూడా సుందరినే వాడుకుంది.

ఇప్పుడు తన మనస్సు ఏ రీతిలో సంచరిస్తుందో తనకి తెలుసు.

తన కష్టాలు గట్టెక్కాయన్న ఆనందంతోపాటు, సుందరి ఇంకా కష్టాల్లోనే ఉండిపోయిందన్న ఆలోచనా తనకి సంతృప్తిని కలిగిస్తోంది. అది నిజంగా ఎంతో క్రూరమయిన భావం. తన

పాలడుగు
వెంకటేశ్వరరావు

పేదరికం తన ఆలోచనల్లో లేకితనం తెచ్చిపెట్టుతూంది.

సుందరికి కృతజ్ఞత చెప్పుకోవటంతో పాటు, ఆమె కన్నుల్లో కదలాడే నిరాశని, దిగులుని చూసి సంతృప్తిపడాలన్న చెడ్డ కోరిక ఒకటి తన మనస్సులో కదులుతూంది. ఎంత చిత్రంగా నడుస్తుంది మనస్సు! ఎంత అన్యాయం నిండి ఉంది ఆ తలపులో! అసలు తనీ వేళ ఇంత సంతోషంతో తబ్బిబ్బవటానికి అదే ముఖ్య కారణమా? కసిగా లోలోన తనని తాను తిట్టుకుని తిట్టుకుని సీత ముడుచుకుపోయి కూర్చుంది.

"ఇదుగో! కాఫీ తీసుకో, మిస్టర్!"

కాఫీకప్పు అందుకుంటూ సుందరి కళ్ళలోకి తదేకంగా చూసింది సీత.

"ఏమిటె, అలా చూస్తున్నావు?"

"ఏం లేదు. ఈ వేళ నీ మొహంలో కొత్త కళ కనిపిస్తుంటేనూ!"

సుందరి నవ్వింది. "అమ్మ దొంగా! పట్టేశావన్న మాట. దానికి కారణం లేక పోలేదులే. ఆ శుభవార్త చెప్పేస్తాను. అందుకే ఈ కాఫీ నీకు."

"అంటేగాని ఇది మామూలుగా ఇచ్చే కాఫీ కాదన్న మాట!"

"కాదు. ఎంతమాత్రం కాదు. స్పెషల్‌గా నేనే చేశాను."

"అయితే, మరేమిటి చెప్పు?"

సుందరి సిగ్గుపడింది.

"అబ్బ! ఇలాంటి విషయాలు ఒక్కసారిగా చెప్పాలంటే కష్టమోయ్!"

"సరే, నీ ఇష్టం. కావలసినంత టైము తీసుకునే చెప్పు."

"అన్నట్టు, ఉద్యోగం షరతులు చెప్పారా? నీకు నచ్చాయా? కష్టపడి పనిచేస్తే పైకి పోయే అవకాశాలున్నాయట. అంతా నీ అదృష్టం."

"కాదు, సుందరీ! ఇదంతా నీ చలవ. నీ ఋణం జన్మజన్మలకీ నేను తీర్చుకునేది కాదు. కష్టంలో దేవతలా ఆదుకున్నావు. నీకు కృతజ్ఞత చెప్పి పోదామనే ఈవేళ పనిగట్టుకుని పొద్దుటే వచ్చాను" అంది సీత.

"థాంక్స్. అంత మాట అవసరం లేదులే. ఇంతకీ నే చెప్పాల్సిన శుభ వర్తమానం ఏమిటంటే. . ."

"ఏమి టది?" ఆత్రంగా అడిగింది సీత.

"మనం ఇంటర్వ్యూకి వెళ్ళిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మా బావే! మా బావ నన్ను గుర్తించాడు. ఆప్యాయంగా మాట్లాడాడు. మా సంగతులన్నీ అడిగి తెలుసుకున్నాడు. మా బావకి గట్టిగా చెప్పి నీకీ ఉద్యోగం వచ్చేలా చేశాను నేను."

"ఊఁ. . ."

"నిన్న మా బావ మా ఇంటికి వచ్చారు. అమ్మా నాన్నలతో అన్నీ మాట్లాడారు. మామయ్య బావ గట్టిగా చెప్పినమీదట తన పట్టుదల సడలించాడట. నన్ను పెళ్ళి చేసుకోవటానికి బావ ఆరాటపడుతున్నాడు. రేపో మాపో వచ్చి ముహూర్తాలు పెట్టుకుంటారట. ఒకటి రెండు నెలల్లో వివాహం. . ." సుందరి ఆగి తల ఎత్తి చూసి చిరునవ్వు నవ్వింది.

"కంగ్రాట్స్, సుందరీ. అంతా నీ అదృష్టం."

"థాంక్స్."

"ఇక వస్తా, సుందరీ!"

"అప్పుడే? !"

"ఆఫీసు కెళ్ళాలి గదా? మళ్ళీ వస్తాలే." సెలవు తీసుకుని సీత బయట పడింది. సుందరి అదృష్టవంతురాలు. మొండిచెట్టులా ఏం బ్రతుకుతనది? తను ఎవరికీ అవసరం లేదు! సీత కాళ్ళు నీరసంగా నడిచాయి.

సీత ఉత్సాహం ఆవిరయింది.

ఉక్క పోస్తూంది. ఎండ తీక్షణంగా ఉంది. చిరాగ్గా ఉంది.

రొద చేసుకుంటూ లారీ దాటి వెళ్ళింది సీతని.

ఈ ప్రపంచంలో తనంత దురదృష్టవంతురాలు లేదేమో అనిపించి సీత గుండెలు నీరసంగా మూలిగాయి. *

# మార్గదర్శులు



39

© First Features

## ఆర్కిటిక్ మహాసముద్ర తరణం

నలుగురు బ్రిటిష్ వారు స్లెడ్జిలతోను, ఎస్కిమో కుక్కల సహాయంతోను ప్రప్రథమంగా ఆర్కిటిక్ మహా సముద్రాన్ని ఉపరితలం మీదుగా దాటారు. వారు వాలీ హెర్బర్ట్ (34), మేజర్ కెన్నెత్ హెడ్జెస్ (34), అలెన్ గిల్ (38), డాక్టర్ రాయ్ కోర్నర్ (36). హెర్బర్ట్ నాయకత్వం వహించారు.

ఈ నలుగురు 1968 ఫిబ్రవరి 21 న అలాస్కాలోని పాయింట్ బారో నుంచి బయలుదేరారు. కొత్తగా ఏర్పడిన కదిలే హిమానీ ఖండాల మీదుగా 80 మైళ్ళు పయనించి ప్రధానమైన ఆర్కిటిక్ హిమానీ ఖండం చేరుకున్నారు. అయినా ఉపరితలంలోని మంచు కదులుతూ స్లెడ్జిని కూడా భరించలేని ప్రదేశం ఇంకా విస్తరించే ఉంది.

జూలై 4 న వారు వేసవిలో మంచు కరగడంకోసం నిరీక్షిస్తూ హిమానీ ఖండం మీద మజిలీ చేశారు. సెప్టెంబరు 4 న తిరిగి బయలుదేరారు. అయితే గిల్ జారి పడి, గాయపడ్డారు. అతడు కోలుకొనే వరకు వారు తిరిగి మజిలీ చేశారు. అయితే ఆ హిమానీ ఖండం పగలగా తిరిగి పయనం ప్రారంభించవలసి వచ్చింది.

1969 ఫిబ్రవరిలో మరల యానం ప్రారంభించి, ఏప్రిల్ 6 న ఉత్తర ధ్రువం చేరి, మే 29 న స్పిట్స్‌బెర్గెన్‌లో తావ్నోయా వద్ద అంతిమంగా భూమిమీద కాలూనారు.